
ఆంధ్రజ్యోతి
andhrajyothy.com
శుక్రవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 40.0 । కనిష్ఠం 25.7

ఆదిలాబాద్
జిల్లా వార్తలు
5
శనివారం 10 మే 2025



● తలమడుగు మండలంలో అధ్వానంగా మారి కనిపిస్తున్న సీసీ రోడ్డు పనులు

అవినీతి.. బీటలు!

- జిల్లాలో అధ్వానంగా ఎన్ఆర్ఈజీఎస్ పనులు
- క్యూరింగ్ లేక పగుళ్లు తేలి కనిపిస్తున్న పల్లె రోడ్లు
- ఇష్టారాజ్యంగా పనులు చేపట్టిన అధికార, ప్రతిపక్ష నేతలు
- పత్తాలేని అధికారులు.. క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ కరువు
- మూన్నాళ్ల ముచ్చటగా మారుతున్న సీసీ, డ్రైనేజీ నిర్మాణాలు
- జిల్లావ్యాప్తంగా ఈ యేడు రూ.62 కోట్ల నిధులతో పనులు

ఆదిలాబాద్, మార్చి 9(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఎన్ఆర్ఈజీఎస్ పథకం కింద చేపట్టిన పనులు నాణ్యత లేక బీటలు వారి కనిపిస్తున్నాయి. కాసుల కోసం కక్కుర్తి పడుతున్న కాంట్రాక్టర్లు, పలువురు నేతలు అభివృద్ధి పనుల్లో అవినీతికి తెరలేపుతున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రతిసారి ఆదరబాదరగా పనులను చేపట్టడంతో అధ్వానంగా మారి కనిపిస్తున్నాయి. పది కాలాల పాటు పదిలంగా ఉండాల్సిన పనుల నాణ్యత మున్నాళ్ల ముచ్చటగా మారింది. రెండు మూడు మాసాలకే సీసీ పనులు కంకరతేలి పగుళ్లతో దర్శనమిస్తున్నాయి. జిల్లావ్యాప్తంగా ఈ యేడు రూ.62 కోట్ల నిధులతో పనులను చేపట్టారు. సుమారుగా 150 కి.మీ.ల నుంచి 175 కి.మీ. మేరకు సీసీ రోడ్ల నిర్మాణ పనులను పూర్తి చేశారు. కొన్ని గ్రామాల్లోనైతే అవసరం లేకున్నా సీసీ రోడ్లను వేసి బిల్లులను జేబులో వేసుకునే ప్రయత్నం చేస్తున్నట్లు తెలుస్తుంది. స్థానికంగానే అందుబాటులో ఉన్న ఇసుక, కంకరతో అడ్డగోలుగా పనులు చేపట్టడంతో పనుల నాణ్యత ప్రశ్నార్థకంగా మారింది. పనులు పూర్తికావడంతో బిల్లులు ముట్టచెప్పేందుకు అధికారులు ప్రయత్నాలు మొదలు పెట్టారు. నాణ్యత పేరిట పది శాతం బిల్లులను నిలుపుదల చేస్తున్నా..ప్రయోజనం కనిపించడం లేదంటున్నారు. ఎన్ఆర్ఈజీఎస్ పనులను చేపట్టిన వారంతా అధికార, ప్రతిపక్ష పార్టీలకు చెందిన వారే కావడంతో అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

సీసీ వేసి వదిలేశారు

మార్చి 31తో గడువు సమయం ముగియడంతో హడావుడి, ఆదరబాదరగా సీసీ రోడ్లను వేసి గాలికి వదిలేశారు. సీసీ రోడ్లను వేసిన మరుసటి రోజు నుంచి కనీసం పక్షం రోజుల పాటైన తప్పనిసరిగా వాటర్ క్యూరింగ్ చేయాల్సి ఉంటుంది. కానీ క్యూరింగ్ చేయకుండానే నిర్లక్ష్యంగా వదిలేయడంతో కంకర పగుళ్లు తేలి కనిపిస్తున్నాయి. అలాగే సిమెంట్ పనుల్లో నాణ్యత లేకపోవడంతో రోడ్లన్నీ దుమ్ములేపుతున్నాయి. అసలే వేసవి కాలం.. ఆపైగా జిల్లాలో 40 డిగ్రీలకు పైగా పగటి ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. అసలు వేసవిలో సీసీ రోడ్ల నిర్మాణ పనులను చేపట్టేందుకు అనువైన సమయంకాక పోయినా.. అధికారులు మాత్రం హడావుడి చేయడంతో నేతలు ఇష్టారాజ్యంగా పనులను చేపట్టారు. పలు చోట్ల ఇసుకకు బదులు కంకర డస్టు వాడకంతో పాటు స్థానికంగా దొరికిన ఇసుకను వాడడంతో నాణ్యత లేకుండానే పోయింది. అంతేకాకుండా సీసీ వేసిన తర్వాత మట్టికట్టలు కట్టి నిండుగా నీటిని నింపి క్యూరింగ్ చేయాల్సి ఉంటుంది. కానీ ఎలాంటి మట్టికట్టలు లేకుండానే ఉదయం, సాయంత్రం వేళల్లో అడపదడప నీళ్లు చల్లడంతో ఏమాత్రం ప్రయోజనం లేకుండానే పోయింది. దీంతో రెండు, మూడు మాసాలకే పగుళ్లు తేలి సీసీరోడ్లని పూర్తిగా ధ్వంసమై పోతున్నాయి. అదేవిధంగా ప్రతి యేటా సీసీ రోడ్లు వేయడం బిల్లులు జేబులో వేసుకోవడమే తప్ప.. నాణ్యతగా పనులు చేపట్టేందుకు ఎవరూ ఆసక్తి చూపడం లేదన్న ఆరోపణలు వస్తున్నాయి.

కాంట్రాక్టర్లుగా మారిన ఖద్దర్ నేతలు

జిల్లాలోని అన్ని నియోజక వర్గాల్లో సుమారుగా రూ.62 కోట్లకు పైగా అభివృద్ధి పనులను చేపట్టారు. కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ నేతలు ఎన్ఆర్ఈజీఎస్ కింద పలు గ్రామాల్లో సీసీ రోడ్లు, డ్రైనేజి నిర్మాణ పనులను చేపట్టారు. పనులు చేసిన వారంతా రాజకీయ పార్టీ నేతలే కావడంతో అధికారులు అడిగేందుకు జంకుతున్నారు. ఒకవేళ అడిగేందుకు ప్రయత్నించినా.. అగ్రస్థాయి నేతల నుంచి ఒత్తిళ్లు రావడంతో అధికారులు సైతం సైలెంటై పోయారన్న విమర్శలు వస్తున్నాయి. అధికారుల నిర్లక్ష్యం, నేతల అలసత్వంతో కోట్ల రూపాయల నిధులు నేలపాలవుతున్నాయి. అధికార, ప్రతిపక్ష నేతలంతా అభివృద్ధి పనులను చేపట్టడంతో గ్రామాల నుంచి పెద్దగా ఫిర్యాదులు కూడా రావడం లేదు. అందరు మండల, గ్రామస్థాయి నేతలే కావడంతో స్థానికులు కూడా పెద్దగా పట్టించుకోవడం లేదంటున్నారు. దీంతో అధికార, ప్రతిపక్ష పార్టీల నేతలు ఇష్టారాజ్యంగా రాత్రికి రాత్రే పనులను పూర్తి చేసి చేతులు దులుపుకోవడంతో పనులన్నీ నాసిరకంగా మారి కనిపిస్తున్నాయి. క్వాలిటీ రిపోర్టులు లేకపోయిన కొంత మంది బిల్లులను జేబులో వేసుకున్నట్లు తెలుస్తుంది. ఇకనైనా క్వాలిటీ విభాగం అధికారులు పనుల నాణ్యతపై తనిఖీలు నిర్వహిస్తే అసలు భాగోతం బయటపడే అవకాశం ఉందంటున్నారు.



● బోథ్ మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్వార్టర్ సమీపంలో పగుళ్లు తేలి కనిపిస్తున్న సీసీ రోడ్డు పనులు

పర్యవేక్షణ కరువు

గ్రామాల్లో రాత్రీ పగలు అనే తేడా లేకుండా పనులు కొనసాగిన అధికారుల పర్యవేక్షణ లేకుండానే పోయిదంటున్నారు. దీంతో అడ్డగోలుగా సీసీ డ్రైనేజీ

(తరువాయి 6వ పేజీలో...)



మంత్రి సీతక్కని కలిసినరాష్ట్ర కో ఆర్డినేటర్ అరుణ్‌కుమార్

'సోనాల మండలానికి 60 ఇందిరమ్మ ఇళ్లు కేటాయించండి'

బోథ్/ సోనాల, మే 9(ఆంధ్రజ్యోతి): నూతనంగా ఏర్పాటైన సోనాల మండలానికి 60 ఇందిరమ్మ ఇళ్లను కేటాయించాలని ఏఐసీసీ విచార్ విభాగ్ తెలంగాణ రాష్ట్ర కోఆర్డినేటర్ తుల అరుణ్‌కుమార్ మంత్రి సీత కనుకోరారు. శుక్రవారం ఈ విషయమై మంత్రికి విన్నవించడంతో మంత్రి ఆదేశాల మేరకు జిల్లా కలెక్టర్ ఇల్లు కేటాయిస్తున్నట్లు తెలపడం జరిగిందన్నారు. తాను అడగగానే ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేసిన మంత్రికి జిల్లా కలెక్టర్ కు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి ఆడే గజేంద్రకు కృతజ్ఞతలు తెలిపారన్నారు.

అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకోవాలి : ఎస్పీ

ఆదిలాబాద్, మే 9(ఆంధ్రజ్యోతి): పోలీసులు అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుని నేరస్తులను పట్టుకోవాలని ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. హెచ్‌వైడీ సెంట్రల్ డిటెక్టివ్ ద్వారా ఆదిలాబాద్‌లోని నూతన ఎస్సైలు, నూతన పోలీసు సిబ్బందికి సాంకేతిక పరిజ్ఞానంపై రోజులపాటు శిక్షణ అందిస్తున్నట్లు తెలిపారు. సైబర్ క్రైమ్ నేరస్తులు వినియోగించే ఆపరేటింగ్ సిస్టం, ఐపీ అడ్రస్, లోకేషన్ వంటివి కనుగొనే పద్ధతులను ఆయన ఈ సందర్భంగా వివరించారు.

అబ్కారీ శాఖకు భారీ ఆదాయం

● పట్టుబడిన వాహనాలకు వేలం

ఇచ్చోడ, మే, 9(ఆంధ్రజ్యోతి): ఇచ్చోడ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో వివిధ కేసులలో పట్టుబడిన వాహనాలకు అబ్కారీ శాఖ జిల్లా అధికారి వై.హిమశ్రీ అధ్యక్షతన శుక్రవారం వేలంపాట నిర్వహించారు. అయితే, ఈ వేలం పాటలో నాలుగు ద్విచక్ర వాహనాలకు వేలం వేయగా 1,15660 రుపాయాల ఆదాయం ఎక్సైజ్ శాఖకు వచ్చినట్లు అబ్కారీ శాఖ సీఐ జుల్ఫీకర్ అహ్మద్ తెలిపారు. అబ్కారీ శాఖ నాలుగు వాహనాలకు 91వేలు ధర నిర్ణయించగా.. వేలం పాటలో పోటీపడి నాలుగు వాహనాలకు 1,15660 రూపాయాలకు దక్కించుకున్నారు. వేలంపాటలో జీఎస్టీ ద్వారా 17640 రూపాయలు వచ్చాయని వివరించారు. దీంతో ఇచ్చోడ అబ్కారీ శాఖ కార్యాలయానికి జీఎస్టీతో కలిపి మొత్తం 133,300 రూపాయాల ఆదాయం వచ్చిందని సీఐ తెలిపారు.

గన్నీ బ్యాగుల కొరతతో నిలిచిపోయిన జొన్నల కొనుగోళ్లు

బోథ్, మే 9(ఆంధ్రజ్యోతి): బోథ్ మార్కెట్ కమిటీ పరిధిలో చేపట్టిన జొన్న పంట కొనుగోళ్లు గన్నీ బ్యాగుల కొరతతో నిలిచిపోయాయి. మార్కెట్ కమిటీ పరిధిలో సోనాల, దన్నూర్ బోథ్‌లలో జొన్న పంట కొనుగోలు ప్రారంభించారు. అయితే నూతనంగా ఏర్పడిన సోనాల మండల కేంద్రంలో జొన్న పంట కొనుగోలను ప్రారంభించిన గన్నిబాగు లేకపోవడంతో కొనుగోల కోసం రైతు ఎదురుచూస్తున్నారు. కాగా గతంలో బతుకు పంపించిన గన్నీ బ్యాగులలో దాదాపు 15 ఏళ్ల బ్యాగులు చిరిగి పోవడంతో పనికిరాకుండా ఉన్నాయి. అయితే, జిల్లా అధికారులు నూతనంగా కొనుగోళ్ల కోసం మరిన్ని బ్యాగులను పంపిస్తే కొనుగోలు ప్రారంభం కానున్నాయి.

హార్డ్ కాపీలను పరిశీలించాలి..

జాబితాను బ్యాంకులకు పంపాలి

● జిల్లా కలెక్టర్ రాజర్షి షా ● రాజీవ్ యువ వికాసం పథకంపై గూగుల్ మీట్ ద్వారా సంబంధిత అధికారులతో సమీక్షా సమావేశం

ఆదిలాబాద్ అర్బన్, మే 9(ఆంధ్రజ్యోతి): రాజీవ్ యువవికాసం పథకం ద్వారా రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ యువతి, యువకుల హార్డ్ కాపీలను పరిశీలించి బ్యాంకులకు జాబితాను పంపాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా సూచించారు. శుక్రవారం గూగుల్ మీట్ ద్వారా సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రాజీవ్ యువ వికాసం పథకం ద్వారా రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న యువతి, యువకుల హార్డ్ కాపీలను పరిశీలించి బ్యాంకులకు జాబితాలను పంపాలన్నారు. ప్రభుత్వ సూచనల మేరకు లబ్ధిదారులకు వేగంగా ఎలాంటి ఇబ్బందులు లేకుండా సేవలను అందించాలని పేర్కొన్నారు. ఈ నెల 12 వరకు డెస్క్, బ్యాంక్ లెవల్ వెరిఫికేషన్ పూర్తి చేసుకుని, 13 నుంచి 19 వరకు మండల లెవల్ సమావేశాలు నిర్వహించుకోవాలని తెలిపారు. అనంతరం కార్పొరేషన్ల వారీగా రెడి చేసి 26వ తేదీ వరకు పూర్తి జిల్లా లెవెల్‌లో వెరిఫికేసన్ చేసుకుని 29 లోగా జిల్లా మీటింగ్ ఏర్పాటు చేయాలన్నారు. మొత్తం 48175 దరఖాస్తులు రాగా అందులో 38911 వెరిఫికేషన్ చేసి ఎక్సెల్ షీట్‌లో బ్యాంకులకు పంపించడం జరిగిందని, మిగితా 27496 వెరిఫికేషన్ చేసి బ్యాంకులకు పంపించడం జరుగుతుందని అధికారులు కలెక్టర్‌కు తెలిపారు. మండల, గ్రామాల వారీగా వచ్చిన దరఖాస్తుల లిస్టును పారదర్శకంగా ఎంపిక చేయాలన్నారు. ఈ నెల 30లోగా కమిటీ ఆమోదించి మంత్రికి నివేదికలు పంపించి జూన్ 2న ఎంపిక చేసిన లబ్ధిదారులకు మంజూరు పత్రాలు ఇవ్వడం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగ బ్యాంకర్స్ తప్పనిసరిగా 3, 4 కేటగిరిలో ఉన్న దరఖాస్తులను తప్పనిసరిగా సిబిల్ స్కోర్ వెరిఫై చేయాలని బ్యాంకర్లకు సూచించారు. అధికారులు దరఖాస్తులను జాగ్రత్తగా పరిశీలించాలని, దరఖాస్తు ఎంపిక ప్రక్రియలో ఎలాంటి లోటుపాట్లు జరగకూడదని స్పష్టం చేశారు. ఇందులో ఐటీడీఏ పీఓ ఖుష్బుగుప్తా, డీఆర్డీఓ, బీసీ, ఎస్సీఎస్టీ వెల్ఫేర్ అధికారులు, లీడ్ బ్యాంకు మేనేజర్, ఎంపీడీఓలు, ఎంపీఓలు, తదితరులు పాల్గొన్నారు.



● గూగుల్ మీట్‌లో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ రాజర్షిషా

● పనుల వివరాలపై జిల్లా కలెక్టర్ ఆరా

ఆదిలాబాద్ అర్బన్: అస్పరేషనల్ బ్లాక్ ప్రోగ్రాంలో భాగంగా నార్నూర్‌లో రీచార్జ్ స్ట్రక్చర్స్, ఐహెచ్‌హెచ్ఎల్ఎస్, ఇందిరమ్మ ఇళ్లు, సీసీ రోడ్లు, డ్రెయిన్లపై సాచురేషన్ ప్రాతిపదికన పనుల పురోగతిపై శుక్రవారం జిల్లా కలెక్టర్ రాజర్షి షా జిల్లాకేంద్రంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో డీఆర్డీఓ, సంబంధిత అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని నార్నూర్ బ్లాక్ డెవలప్‌మెంట్ కోసం నీతి-అయోగ్ వాటర్ పునరుద్ధరణ ప్రాజెక్టులో భాగంగా చెరువు పూడిక పనుల అప్‌డేట్ పనుల వివరాలపై చర్చించారు. మండలంలోని మొత్తం 14 గ్రామాల్లో (బాలన్‌పూర్, నార్నూర్, గంగాపూర్ ట్యాంక్-1, ట్యాంక్-2) 4 గ్రామాల పనులు నిరంతరంగా జరుగుతున్నాయని పేర్కొన్నారు. మిగతా చెరువుల పూడిక పనులు 2, 3రోజుల్లో మొదలయి త్వరలో పూర్తి చేయడం జరుగుతుందని తెలిపారు. స్వచ్ఛభారత్ మిషన్‌లో భాగంగా గ్రామాల్లో వ్యక్తిగత మరుగుదొడ్లు నిర్మించడానికి కేంద్రప్రభుత్వం ఐహెచ్‌హెచ్ఎల్ వ్యక్తిగత మరుగు దొడ్ల నిర్మాణం పథకంలో భాగంగా నార్నూర్ మండలం సంబంధిత జీపీలలో నిర్మించతల పెట్టిన మరుగుదొడ్ల నిర్మాణాలు లక్ష్యాలను వందశాతం పూర్తి చేరేయాలని డీఆర్డీఓను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీఆర్డీఓ రవీందర్, డీఏఐఎఫ్ ఎన్జీఓ ప్రతినిధులు సాయి, సుధాకర్, రాకేష్, డీడబ్ల్యుఓ, ఈఈపీఆర్, ఎంపీఓ, ఏపీవో, తదితరులున్నారు.



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ రాజర్షి షా



సమావేశంలో పాల్గొన్న అధికారులు

తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలి

● సాయిలింగి జీపీలో డీఎల్‌పీవో ఫణీంధర్ ఆకస్మిక తనిఖీ

తలమడుగు, మే 9(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో తాగునీటి సమస్యలు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని డీఎల్‌పీవో ఫణీందర్ కోరారు. శుక్రవారం మండలంలోని సాయిలింగి గ్రామంలోని గ్రామ పంచాయతీని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూగర్భ జలాలు అడుగంటి పోవడంతో కొన్ని గ్రామాల్లో తాగునీటి ఇబ్బందులు ఎదురవుతున్నాయని అన్నారు. తాగునీటి ఇబ్బందులు ఉన్న గ్రామాల్లో వాటర్ ట్యాంకుల ద్వారా నీరు సరఫరా చేయాలన్నారు. అదేవిధంగా గ్రామంలోని రక్షిత వాటర్ ట్యాంక్. మిషన్ భగీరథ వాటర్ ట్యాంక్ రెండు రోజులకోసారి క్లోరినేషన్ చేసి శుభ్రపరచాలని ఆయన ఈ సందర్భంగా సూచించారు. ముఖ్యంగా గ్రామాల్లో ఎప్పటికప్పుడు మురికి కాలువలు శుభ్రపరచాలని కోరారు. అంతేకాకుండా పంచాయతీ సిబ్బంది సమయపాలన పాటించి గ్రామీణ ప్రాంతాల నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని పేర్కొన్నారు. అనంతరం గ్రామాల్లోని వీధుల గుండా పర్యటించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం గ్రామ పంచాయతీ రిజిస్టర్లను పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఇందులో గ్రామ పంచాయతీ సెక్రెటరీ నిమ్మల అజయ్ వర్ధన్ రెడ్డి, కారోబార్ వినోద్, తదితరులు ఉన్నారు.



సాయిలింగిలో గ్రామ పంచాయతీ రిజిస్టర్‌ను పరిశీలిస్తున్న డీఎల్‌పీవో



కల్లూరుగూడ, చింతగూడ గ్రామాల మధ్య వంతెన నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బొజ్జుపటేల్

త్వరితగతిన వంతెన నిర్మాణ పనులను పూర్తి చేయాలి : ఎమ్మెల్యే బొజ్జు

ఉట్నూర్, మే 9(ఆంధ్రజ్యోతి): ఉట్నూర్ మండలంలోని చింతగూడ, కల్లూరుగూడ గ్రామాల మధ్య నూతనంగా నిర్మిస్తున్న బ్రిడ్జి పనులను ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ శుక్రవారం పరిశీలించారు. ఈ ఆయన సందర్భంగా అధికారులతో ఫోన్‌లో మాట్లాడి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు.రాష్ట్ర ప్రభుత్వం గ్రామాల అభివృద్ధికి పెద్దపీట వేస్తుందని పేర్కొన్నారు. మారుమూల గ్రామీణ ప్రాంతాలలోని ప్రజల సౌకర్యార్థం రోడ్లను వేస్తున్నామని తెలిపారు. గ్రామాల అభివృద్ధే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు.

ఆదిలాబాద్‌లో న్యాయవాదుల ర్యాలీ

ఆదిలాబాద్, మే 9(ఆంధ్రజ్యోతి): పాకిస్థాన్‌పై భారత సైన్యం దాడులు జరుపుతున్న నేపథ్యంలో భారత సైన్యానికి, ప్రభుత్వానికి తమ సంపూర్ణ మద్దతు ఉంటుందని ఆదిలాబాద్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నగేష్ అన్నారు. ఆపరేషన్ సిందూర్‌కు మద్దతుగా శుక్రవారం పట్టణంలో న్యాయవాదులు ర్యాలీ నిర్వహించారు. జాతీయ జెండాలను చేతపట్టుకుని భారత్ మాతాకీ జై అంటూ నినాదాలతో హోరెత్తించారు. ఉగ్రవాదాన్ని రూపుమాపడమే లక్ష్యంగా సైనికులు పని చేస్తున్నారని కొనియాడారు.

మార్కెట్ యార్డులో అన్నదాన కార్యక్రమం

బోథ్, మే 9(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని మార్కెట్ యార్డులో జొన్న రైతుల కోసం చేపట్టిన నిత్య అన్నదాన కార్యక్రమం రెండవ రోజున శుక్రవారం కొనసాగింది. ఈ కార్యక్రమానికి మార్కెట్ కమిటీ చైర్మన్ బి. గంగారెడ్డితో పాటు స్థానిక ఎస్సై ప్రవీణ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల కోసం చేపట్టిన కార్యక్రమం ఎంతో మంచిదన్నారు. అన్నదాతలకు అన్నదానం చేయడం గొపజి విషయమని పేర్కొన్నారు. కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ గొర్ల రాజు యాదవ్‌ను అభినందించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్లు అబ్రహీముద్దీన్, రైతులు, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీఐ సునీల్ కుమార్

రాత్రి దుకాణాలు మూసివేయాలి : సీఐ

ఆదిలాబాద్, మే 9(ఆంధ్రజ్యోతి): రాత్రి 10.30 తర్వాత వ్యాపార సముదాయాలు మూసివేయాలని 1వ టౌన్ సీఐ సునీల్ కుమార్ వ్యాపారులకు సూచించారు. మూడు రోజులుగా ఆదిలాబాద్‌లో గస్తీ నిర్వహిస్తున్న పోలీసు సిబ్బందితో పలువురు వ్యాపారాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ దుకాణాలను తెరిచి ఉంచారు. దీంతో 10 మందిపై కేసు నమోదు చేసి వారికి శుక్రవారం కౌన్సెలింగ్ ఇచ్చినట్లు సీఐ తెలిపారు.

భారత జవాన్లకు మద్దతుగా

జైనథ్ ఆలయంలో ప్రత్యేక పూజలు



జైనథ్ ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న నాయకులు, అధికారులు

జైనథ్, మే 9 (ఆంధ్రజ్యోతి): భారత్-పాకిస్థాన్ యుద్ధంలో మన దేశానికి చెందిన ఆర్మీకి మద్దతుగా శుక్రవారం మండల కేంద్రమైన జైనథ్‌లో శ్రీలక్ష్మీనారాయణస్వామి ఆలయంలో ప్రత్యేకపూజలు నిర్వహించారు. యుద్ధంలో భారత్‌దేశం గెలవాలని ప్రపంచదేశాలు ఉగ్రవాదాన్ని వీడి అభివృద్ధి వైపు పయనించాలని వేడుకున్నారు. ఈ కార్యక్రమంలో జైనథ్ మండల ఏఎస్సై స్వామి, జైనథ్ మాజీ ఉప సర్పంచ్ గడ్డం జగదీశ్‌రెడ్డి, జైనథ్ మార్కెట్ కమిటీ చైర్మన్ అల్లూరి అశోక్‌రెడ్డి, నాయకులు రాజన్న, గంగారెడ్డి, ఆలయ అర్చకులు వెంకట రమణాచారి తదితరులు పాల్గొన్నారు.

దేశ సమగ్రత కోసం కొనసాగుతున్న పాదయాత్ర



బోరజ్ పాదయాత్రలలో పాల్గొన్న సభ్యులు

జైనథ్, మే 9(ఆంధ్రజ్యోతి): భారతదేశ సమగ్రత సార్వభౌమత్వం ఐక్యత అనే అంశంపై తమిళనాడు రాష్ట్రంలోని రామేశ్వరం నుంచి గత మార్చి 3వ తేదీన ప్రారంభమైన పాదయాత్ర శుక్రవారం జైనథ్ ఉమ్మడి మండలంలోని బోరజ్ 44వ జాతీయ రహదారి వరకు చేరుకుంది.ఈ సందర్భంగా టీంలీడర్ టి.వెంకటచటం మాట్లాడుతూ దేశ సమగ్రత సౌరభౌమత్వం కోసం మార్చి 3న తమిళనాడు రాష్ట్రంలోని రామేశ్వరం నుంచి ఈ పాదయాత్ర మొదలైంది. ఈ పాదయాత్ర వచ్చే 28 వారణాసిలో ముగుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో 24మంది పాదయాత్ర సభ్యులతో పాటు నాయకులు ఆర్.రాజేందర్‌లతో పాటు టీం సభ్యులు పాల్గొన్నారు.

నకిలీ విత్తనాల నిర్మూలనకు

టాస్క్‌ఫోర్స్ బృందాల ఏర్పాటు

- వ్యాపారులు నిబంధనలను పాటించాలి
- డీలర్ల అవగాహన సమావేశంలో ఉట్నూర్ ఏఓ



సమావేశంలో మాట్లాడుతున్న ఏఓ గిత్తే రమేష్

ఉట్నూర్, మే 9(ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని రైతులు నకిలీ విత్తనాల బారిన పడకుండా ఉండడానికి ప్రభుత్వ ఆదేశాల మేరకు మండల, డివిజన్ స్థాయిలలో టాస్క్‌ఫోర్స్ బృందాలు ఏర్పాటు చేశామని మండల వ్యవసాయ అధికారి గిత్తే రమేష్ అన్నారు. శుక్రవారం ఉట్నూర్ మండల కేంద్రంలోని రైతువేదికలో ఎరువులు, విత్తనాల డీలర్లు, సహకార సంఘాల నిర్వాహకులతో నిర్వహించిన అవగాహన సమావేశంలో ఆయన మాట్లాడారు. మండల స్థాయిలో తహసీల్దార్, వ్యవసాయ అధికారి, పోలీసు సబ్‌ఇన్‌స్పెక్టర్‌లతో, డివిజన్ స్థాయిలో రెవెన్యూ డివిజనల్ అధికారి, ఏడీఏ, సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌లతో టాస్క్‌ఫోర్స్ బృందాలు జిల్లా ఉన్నతాధికారుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేశామన్నారు. రాత్రివేళల్లో ఎక్కడ కూడా విత్తనాల అమ్మకాలు, నిల్వలు చేయవద్దన్నారు. అలా చేస్తే కఠినచర్యలు ఉంటాయన్నారు. ప్రతీ డీలర్ వద్ద అమ్మకం కొనుగోలు రిజిస్టర్‌లతో పాటు, స్టాక్ రిజిస్టర్లు కొనుగోలు చేసిన ఇన్ వాయిస్ బిల్లులు ఉండాలన్నారు. రైతులకు విక్రయించిన విత్తనాలు తప్పకుండా బిల్లులు ఇవ్వాలని, బిల్లులు ఇవ్వని డీలర్‌లపై రైతులు పిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటామన్నారు. ప్రతి డీలర్ తమ దుకాణంలో బ్లాక్ బోర్డు పై స్టాక్ నిల్వలు ధరలు తప్పనిసరిగా రాయా లన్నారు. ఈ సమావేశంలో మండల వ్యవసాయ విస్తరణ అధికారులు కుడిమెత సుధాకర్, నాగోరావు, జయశ్రీ, రంజిత్ తదితరులున్నారు.

భూభారతి, రెవెన్యూ సదస్సులపై

కళాజాతా బృందాలతో అవగాహన



శకాపూర్‌లో కళాజాత బృందాల సభ్యులతో తహసీల్దార్ రాజేశ్వరి

జైనథ్, మే 9 (ఆంధ్రజ్యోతి) : భూభారతి రెవెన్యూ సదస్సులపై కళాజాతా బృందాలచే అవగాహన కల్పిస్తున్నట్లు భోరజ్ మండల తహసీల్దార్ రాథోడ్ రాజేశ్వరి సూచించారు. శుక్రవారం మండలంలోని శకాపూర్‌లో రైతులకు అవగాహన కల్పించి భూభారతి చట్టం ద్వారా భూ సమస్యలు పరిష్కరించుకోవాలన్నారు.మండలంలో 3 బృందాలుగా అధికారులను ఏర్పాటు చేసిన కౌంటర్ల ద్వారా దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు తెలిపారు. ఈ నెల 16 వరకు ఆయా గ్రామాల్లో రైతుల నుంచి దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు తెలిపారు.

నకిలీ విత్తనాలు కొనొద్దు

- పత్తి విత్తనాలపై అవగాహన సదస్సులో ఏఈఓ



నార్నూర్, మే 9(ఆంధ్రజ్యోతి): ఖరీఫ్ వానాకాలం సీజన్‌లో రైతులు పత్తి విత్తనాల అధికారిక డీలర్ దగ్గరనే కొనుగోలు చేయాలని ఏఈఓ నిఖిల్ రాజ్ బొంకటి అన్నారు. శుక్రవారం మండలంలోని ఉమ్రి గ్రామం రైతులకు అవగాహన సదస్సు ఏర్పాటు చేసి మాట్లాడారు. ఎట్టి పరిస్థితుల్లోనూ రైతులు నకిలీ విత్తనాలు కొని మోస పోవద్దని సూచించారు. మార్కెట్ పరిధి డీలర్ దుకాణం వారు అందించే విత్తనాలు కొనాలని , దానికి సంబంధించిన రసీదులు తీసుకుని తమ దగ్గర ఉంచుకోవాలన్నారు. గుర్తు తెలియని వారు గ్రామాలు వస్తే లాటరీ పేరుతో మభ్య పెట్టేందుకు ప్రయత్నించడం ప్రారంభిస్తారని వారి వలలో పడొద్దన్నారు. అలాంటి వారి గురించి అధికారులకు సమాచారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో రైతులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో తీర్మానించిన

బీసీలకు 42శాతం రిజర్వేషన్ బిల్లును అమలు చేయాలి

- బీసీ ఫెడరేషన్ జాతీయ అధ్యక్షులు జక్కని సంజయ్



బోథ్ మండల కేంద్రంలో మాట్లాడుతున్న బీసీ ఆజాద్ ఫెడరేషన్ జాతీయ అధ్యక్షుడు

బోథ్, మే 9 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రప్రభుత్వం అసెంబ్లీలో తీర్మానించిన విధం గా 42 శాతం రిజర్వేషన్లను అమలు చేసి కులగణన శాస్త్రీయ పద్ధతిలో చేపట్టాలని బీసీ ఫెడరేషన్ జాతీయ అధ్యక్షులు జక్కని సంజయ్ డిమాండ్ చేశారు. శుక్రవారం బోథ్ మండల కేంద్రానికి రథయాత్ర చేరు కుంది. ఈ సందర్భంగా బస్టాండ్‌లో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి అనంతరం అక్కడే ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడారు. బీసీలకు సరైన అవకాశాలు లేక రాజకీయంగా వెనుకబడిపోతున్నారన్నారు. బీసీలలో ఎంతో మంది కడు పేదరికంలో గడుపుతున్న వారు ఉన్నారన్నారు. అంతేగాక బీసీలను గతంలో నుంచి అన్ని రంగాల్లో ముందుకు రాకుండా పాలకులు కుట్ర పన్నుతున్నారని విమర్శించారు. రానున్న రోజుల్లో బీసీ జెండాను పల్లె పల్లెలో ఎగరవేయడమే లక్ష్యంగా బీసీ మేలుకొలుపు రథయాత్రను గ్రామ గ్రామాన కొనసాగించడం జరుగుతుందన్నారు. కొండ లక్ష్మణ్ బాపూజీ స్ఫూర్తితో రథయాత్రను ప్రారంభించడం జరిగిందని, ఆయన గ్రామం నుంచి రథయాత్ర మొదలుపెట్టామన్నారు. చివరికి రథయాత్రను అలంపూర్ గ్రామంలో ముగిస్తామన్నారు. కార్యక్రమంలో రజక రిజర్వేషన్ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు చాపర్తి కుమార్‌గాడ్గే, బీసీ ఫెడరేషన్ నాయకులు మాచర్ల శ్రీనివాస్, నామాని అర్జున్ స్థానిక కుల సంఘాల నాయకులు బి.గోవర్ధన్ కలిపే శ్రీనివాస్‌లతోపాటు పలువురు పాల్గొన్నారు. కాగా.. ఈ సందర్భంగా అడ్‌హక్ కమిటీని ప్రకటించారు. సభ్యులుగా మల్లెపూల శివారెడ్డి, కొండస్వామి తదితరులను ప్రకటించారు.

పాకిస్తాన్, బంగ్లా దేశీయులను ఇండియా నుంచి వెంటనే పంపించాలి

తలమడుగు, మే 9(ఆంధ్రజ్యోతి): పాకిస్తాన్, బంగ్లాదేశ్‌ల నుంచి వచ్చి నివసిస్తున్న పౌరులను వెంటనే పంపించాలని బీజేపీ ఆదిలాబాద్ జిల్లా శాఖ పిలుపు మేరకు శుక్రవారం తలమడుగు మండల శాఖ ఆధ్వర్యంలో రెవెన్యూ అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు మాట్లాడుతూ.. గత కొన్ని రోజుల ముందు కశ్మీర్ అందాలను వీక్షించేందుకు వెళ్లిన పర్యాటకులపై పహల్గాం ఉగ్రాదులు దాడి చేశారన్నారు. ఈ దాడిలో 26మంది ప్రాణాలు కోల్పోయారన్నారు. ఈ దాడి వెనక పాకిస్తాన్ హస్తం ఉందన్నారు. అందువల్ల ఆదిలాబాద్ జిల్లాలో అక్రమంగా నివసిస్తున్న పాకిస్తాన్, బంగ్లాదేశ్ పౌరులను గుర్తించి వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. శాంతిభద్రతల దృష్ట్యా చర్యలు తీసుకోవాలని తలమడుగు మండలంలోని తహసీల్దార్‌కు అందజేసిన వినతిపత్రంలో కోరారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షులు బోనగిరి స్వామి, బీజేపీ ఉపాధ్యక్షులు నక్క ధనుంజయ్, బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి ముత్యాల దేవన్న, బీజేపీ యువమోర్చ మండల అధ్యక్షులు దాతజీ కిరణ్, కిషాన్ మోర్చా అధ్యక్షులు అడెపు శ్రీనివాస్, గిరిజన మోర్చ అధ్యక్షులు గోడం భుజంగ్ రావ్, మహిళా మోర్చా మండల నాయకురాలు నైతం పాయల్, కోరన్న పురుషోత్తం, మహేందర్ యాదవ్, బొమ్మిని అశోక్, శ్రీనివాస్ రెడ్డి, రజినీకాంత్, కైలాస్, కిష్టు, ప్రేమెందర్, నారాయణరెడ్డి పాల్గొన్నారు.



డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న బీజేపీ నాయకులు

గుండెపోటుతో సివిల్ కాంట్రాక్టర్ మృతి

- గత ఏడాదిగా పెండింగ్‌లో రూ.50 కోట్ల బిల్లులు
- తీవ్ర మనస్థాపం వల్లేనన్న కుటుంబీకులు
- గుట్ట ప్రవీణ్ హఠాన్మరణం పట్ల ఎంపీ, ఎమ్మెల్యేల సంతాపం
- ఆదిలాబాద్ జిల్లాలో విషాదం



గుట్ట ప్రవీణ్ (ఫైల్)

ఆదిలాబాద్, మే 9 (ఆంధ్రజ్యోతి) : ఆదిలాబాద్ జిల్లాకు చెందిన సివిల్ కాంట్రాక్టర్ గుట్ట ప్రవీణ్ (46) గురువారం అర్ధరాత్రి గుండెపోటుతో హఠాన్మరణం చెందారు. ప్రభుత్వం నుంచి రావాల్సిన పెండింగ్ బిల్లుల కోసం గురువారం ఉదయం ఆయన ఆదిలాబాద్ నుంచి హైదరాబాద్‌కు వెళ్లారు. పనులు ముగించుకుని తిరిగి ఆదిలాబాద్‌కు వస్తున్న క్రమంలో.. రాత్రి 11 గంటల సమయంలో చాతిలో నొప్పి రావడంతో హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. పరిశీలించిన వైద్యులు అప్పటికే ప్రవీణ్ మృతి చెందినట్లు నిర్ధారించారు. శుక్రవారం ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని ఓల్డ్ హౌజింగ్ బోర్డు కాలనీలో ప్రవీణ్ అంత్యక్రియలు నిర్వహించారు. కాగా.. ప్రభుత్వం నుంచి ప్రవీణ్‌కు చెందిన తిరుమల కన్‌స్ట్రక్షన్ కంపెనీకి రావాల్సిన రూ.50కోట్ల బిల్లులు గత యేడాది కాలంగా పెండింగ్‌లో ఉన్నట్లు తెలుస్తోంది. దీంతో ఐదారు నెలలుగా బిల్లుల కోసం ప్రవీణ్ తరచూ హైదరాబాద్ వెళ్తూ వస్తున్నారు. అయినా పెండింగ్ బిల్లులను ప్రభుత్వం విడుదల చేయకపోవడంతో.. ఇటీవలి కాలంలో ప్రవీణ్ తీవ్ర మన స్థాపానికి గురవుతున్నట్లు కుటుంబ సభ్యులు, బంధువులు పేర్కొంటున్నారు. ఈ క్రమంలోనే తీవ్ర అస్వస్థతకు గురై గుండె పోటుతో మరణించినట్లు చెబుతున్నారు. మరోవైపు.. గుట్ట ప్రవీణ్ మృతితో ఆదిలాబాద్ జిల్లాలో తీవ్ర విషాదం నెలకొంది. ఎంపీ గోడం నగేష్, ఎమ్మెల్యేలు పాయల శంకర్, అనిల్ జాదవ్, మాజీ మంత్రి జోగు రామన్న, డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జీలు కంది శ్రీనివాస్‌రెడ్డి ఆడే గజేందర్ మాజీ జడ్పీటీసీ గోకగణేష్‌రెడ్డి,మాజీ మున్సిపల్ చైర్మన్ రంగినేని మనిషా పవన్‌రావు, కాంగ్రెస్ నాయకులు శ్రీకాంత్‌రెడ్డి తదితర ప్రముఖులు ప్రవీణ్ మృతి పట్ల సంతాపం ప్రకటించారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాల ప్రారంభం

సారంగాపూర్, మే 9 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంతో పాటు యాకర్‌పెల్లి, జాం గ్రామాలలో శుక్రవారం కొట్ల(బి) సొసైటీ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను మార్కెట్ చైర్మన్ అబ్దుల్‌హాదీ, సొసైటీ చైర్మన్ అయిరా నారాయణ్‌రెడ్డిలు ప్రారంభించారు. సందర్భంగా వారు మాట్లాడారు. రైతులు ఆరుగాలం శ్రమించి పండించిన ధాన్యాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలోనే విక్రయించాలని దళారులకు అమ్మి మోసపోవద్దని అన్నారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సొసైటీ సిబ్బంది, రైతులు ఉన్నారు.



సారంగాపూర్ మండలంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

గొల్లమాడ గ్రామంలో

నర్సాపూర్(జి), మే 9 (ఆంధ్రజ్యోతి) : నర్సాపూర్(జి) మండలంలోని గొల్లమాడ గ్రామంలో శుక్రవారం డీసీఎంఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం స్థానిక నాయకులు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... రైతులు ప్రభుత్వం కల్పిస్తున్న మద్దతు ధరను సద్వినియోగం చేసుకోవా లన్నారు. ఈ కార్యక్రమంలో నాకిడి నవీన్, చిన్న మహేష్, పాపెన్ రాజేశ్వర్, నిర్వాహకుడు గోస్కుల భూమయ్య, రైతులు పాల్గొన్నారు.



నర్సాపూర్(జి) మండలంలోని గొల్లమాడ గ్రామంలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

అవసరమైన మందులను అందుబాటులో ఉంచాలి

- నిర్మల్ జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి రాజేందర్



జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి రాజేందర్

నిర్మల్ కల్చరల్, మే 9 (ఆంధ్రజ్యోతి) : రోగులకు అవసరమైన మందులను అందుబాటులో ఉంచాలని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి రాజేందర్ ఆదేశించారు. శుక్రవారం డ్రగ్స్ స్టోర్ పరిశీలించారు. సూపరిండెంట్ గోపాల్ సింగ్ ఆయనతో పాటు పాల్గొన్నారు. జిల్లా, రాష్ట్ర డ్రగ్స్ స్టోర్ నుండి ఇండెంట్ ద్వారా పొందాలన్నారు. వైద్య కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్, డాక్టర్ సునీల్ పాల్గొన్నారు.

ఉపాధి హామీ కూలీలు సమయపాలన పాటించాలి

బోథ్, మే 9 (ఆంధ్రజ్యోతి) : ఎండల తీవ్రత దృష్ట్యా ఉపాధి హామీ కూలీలు సమయపాలన పాటించి పనులను సకాలంలో పూర్తి చేసుకోవాలని ఎంపీడీవో రమేష్ పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని కుచలాపూర్ గ్రామంలో ఉపాధి హామీ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా అయన పూజలకు పలు సూచనలు చేశారు. పని ప్రదేశాలలో తాగునీటిని ఉంచుకోవాలని అంతేగాక ఎండ తీవ్రత దృష్ట్యా సకాలంలోనే పనులు ముగించుకొని ఇళ్లకు వెళ్లాలని కోరారు. ప్రభుత్వం నిర్ణయించిన ధరలు చెల్లించడం జరుగుతుందని, అక్రమాలకు తావుండదని వివరించారు. యంత్రాలతో పనులు చేయవద్దని ఎక్కడైనా యంత్రాలతో పనులు జరిగినట్లు తెలిస్తే కూలీలు చెల్లించేది లేదని పేర్కొన్నారు. పనులను ఉపాధి హామీ సిబ్బంది పర్యవేక్షించడం జరుగుతుందని ఎట్టి పరిస్థితుల్లో అక్రమాలకు తావు లేదన్నారు.

ఇంటర్ ఉచిత విద్యను సద్వినియోగం చేసుకోవాలి

ఇంద్రవెల్లి, మే 9 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అందిస్తున్న ఇంటర్మీడియట్ ఉచిత విద్యను అందరు సద్వినియోగం చేసుకోవాలని ఆదివాసీ హక్కుల పోరాట సమితి తుడుం దెబ్బ విద్యార్థి సంఘం మండల ప్రధాన కార్యదర్శి కాత్లె పృథ్వీరాజ్ అన్నారు. మండలంలోని ధనోరా గ్రామంలో శుక్రవారం నిర్వహించిన ప్రభుత్వ జూనియర్ కళాశాల ఇంటర్మీడియట్ అడ్మిషన్ డ్రైవ్ కార్యక్రమంలో భాగంగా పదవ తరగతి పాసైన విద్యార్థుల ఇంటి వద్దకు వెళ్లి విద్యార్థులకు, తల్లి దండ్రులకు ప్రభుత్వం ఇంటర్ విద్యపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులు కోరుకున్న గ్రూపులో ఇంటి వద్దనే అడ్మిషన్ అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు ఇలాంటి మానసిక ఒత్తిడి లేని విద్య ప్రభుత్వ కళాశాలలోనే సాధ్యమన్నారు. తల్లిదండ్రులు, విద్యార్థులు ప్రైవేట్ కంటే ప్రభుత్వ కళాశాలలకు ప్రాధాన్యత నివాలన్నారు. ఇంటర్ కళాశాలల బలోపేతానికి తమ సంఘం తమ వంతు పాత్ర వహిస్తుంది అన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు మధుకర్, దళిత్ వెంకటేష్, రవి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ నాయకుడిని పరామర్శించిన రితేష్ రాథోడ్

ఇంద్రవెల్లి, మే 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని ముత్నూర్ గ్రామానికి చెందిన ఎంఆర్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి కాంబ్లే బాలాజీ మాదిగ ఇటీవల అనారోగ్యంతో చికిత్స పొంది కోలుకొన్న విషయం తెలుసుకున్న బీజేపీ నిర్మల్ జిల్లా అధ్యక్షులు రితేష్ రాథోడ్ శుక్రవారం ఆయనను పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట బీజేపీ మండల అధ్యక్షుడు కేంద్రే బాలాజీ, మహిళా మోర్చా అధ్యక్షురాలు రాథోడ్ రాధిక తదితరులున్నారు.

నకిలీ విత్తనాలు విక్రయిస్తే క్రిమినల్ కేసులు

తలమడుగు, మే 9(ఆంధ్రజ్యోతి): రైతులకు నకిలీ విత్తనాలు విక్రయిస్తే క్రిమినల్ కేసులు తప్పవని మండల వ్యవసాయ అధికారి ప్రమోద్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో నిర్వహించిన డీలర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దుకాణాల్లో నాణ్యమైన విత్తనాలు అందించాలని సూచించారు.

అవినీతి.. బీటలు!

(5వ పేజీ తరువాయి...)

నిర్మాణ పనులను చేపట్టినట్లు తెలుస్తుంది. పనులను పర్యవేక్షించాల్సిన పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ విభాగం అధికారుల నిండు నిర్లక్ష్యం కనిపిస్తుంది. అసలు నిబంధనల ప్రకారం సీసీ వేసే ప్రదేశంలో ముందుగా నేలను చదును చేసి ఆ తర్వాత పాలథిన్ కవర్‌తో సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టాల్సి ఉంటుంది. కాని ఎక్కడ ప్లాస్టిక్ కవర్లు వేసి సీసీ రోడ్లు వేసిన దాఖలాలు కనిపించడం లేదు. ఆదరబాదరగా నేల మట్టి పైననే నిర్లక్ష్యం గా సీసీ వేయడంతో నాణ్యత లేకుండానే పోయింది. నల్లరేగడి నేల్లోనైతే ఏదైనా భారీ వాహనం వెళ్తే సీసీ పూర్తిగా కుంగిపోయే ప్రమాదం కనిపిస్తుంది. ప్రతియేటా ఇదేతంతు కనిపిస్తున్నా.. చర్యలు తీసుకునేందుకు అధికారులు వెనుకాడడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఏదైనా ఫిర్యాదు వస్తే తప్ప క్షేత్రస్థాయిలో పరిశీలించకుండానే బిల్లులను ముట్టచెబుతున్నట్లు తెలుస్తుంది. ఇదంతా నిబంధనలకు విరుద్ధమే అయినప్పటికీ పీఆర్ అధికారులు మాత్రం సైలెంట్‌గానే కనిపిస్తున్నారు.

అవసరం మేరకే

పురుగు మందులను వినియోగించుకోవాలి



మంద బొగుడ గ్రామంలో మాట్లాడుతున్న శాస్త్రవేత్తలు

బోథ్, మే 9(ఆంధ్రజ్యోతి): రైతులు అవసరాల మేరకు మాత్రమే రసాయనిక ఎరువులు పురుగుమందులను వినియోగించుకోవాలని వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ మంజులత పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని మందపాడు గ్రామంలో రైతు ముంగిట వ్యవసాయ శాస్త్రవేత్తలు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటైన కార్యక్రమంలో మాట్లాడుతూ కొనుగోలు చేసిన ప్రతి చెరువులకు రసీదులను భద్రపరిచి ఉంచాలన్నారు సాగునీటిని ఆదా చేయడం కోసం కొత్త పద్ధతులను అవలంబించాలన్నారు. పంట మార్పిడి పద్ధతులను పాటించినట్లయితే ఆశించిన స్థాయిలో దిగుబడులు పొందవచ్చు అన్నారు విత్తన శుద్ధి తప్పనిసరిగా చేయాలన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ ఎస్ కిరణ్‌రెడ్డి మాట్లాడుతూ వాతావరణ అంచనాలను ముందుగా తెలుసుకొని పంట కోతసాగు చేయాలని సూచించారు. సమావేశంలో డాక్టర్ కె.మౌనిక మాట్లాడుతూ ఉద్యానవన పంటల ప్రాముఖ్యత కూరగాయలలో వచ్చే చీడపీడల నివారణ పవిత్ర అంశాలపై వివరించారు. కుమారి జాదవ్, హరిప్రియ విత్తన వినియోగం తదితర అంశాలపై వివరించారు. ఈ కార్యక్రమంలో మండల వైశాధికారి ఎస్. రవితేజ ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీ పథకాల గురించి వివరించారు. ఈ సందర్భంగా కేరాం ఏఈఓ వెటర్నరీ అసిస్టెంట్ రాజేందర్, గ్రామ రైతులు పాల్గొన్నారు.

రామలింగంపేట్‌లో పేకాటరాయుళ్ల పట్టివేత

ఉట్నూర్, మే 9 (ఆంధ్రజ్యోతి) : ఉట్నూర్ మండలంలోని రామలింగంపేట్ గ్రామ శివారులోని ఓ రైతు వ్యవసాయ భూమిలో పేకాట ఆడుతున్న ఐదుగురిని పట్టుకున్నామని ఉట్నూర్ పోలీసులు తెలిపారు. ఐదుగురు ఉద్యోగులు వ్యవసాయ క్షేత్రంలో పేకాట ఆడుతున్నారని సమాచారం రావడంతో ఉట్నూర్ పోలీసు సిబ్బంది కలిసి పేకాట ఆడుతున్న ప్రాంతంలోకి వెళ్లగా అక్కడ ఐదుగురు ఉద్యోగులు పేకాట ఆడుతుండడంతో పట్టుకున్నామని, వారిదగ్గర రూ.13020 రూపాయలు ఐదు సెల్‌ఫోన్లు మూడుద్విచక్ర వాహనాలు సీజ్ చేయడం జరిగిందన్నారు. పేకాట రాయుళ్లను పట్టుకున్నందుకు ఉట్నూర్ ఏఎస్పీ కాజల్, పోలీసు ఉద్యోగులను అభినందించారు.



ఎన్నికైన నూతన కార్యవర్గ సభ్యులు

ఎన్‌హెచ్‌ఆర్‌సీ జిల్లా కార్యవర్గం ఎన్నిక

నిర్మల్ రూరల్, మే 9 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంలో ని టీఎన్జీవో భవన్‌లో శుక్రవారం జాతీయ మానవ హక్కుల కమిటీ (ఎన్‌హెచ్‌ఆర్‌సీ)ని ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో నిర్మల్ జిల్లా వైస్ చైర్మన్ ఓడ్నాల రాజు, భీమ్‌రాజ్, జిల్లా సెక్రటరీ పొన్న శివాజీ గౌడ్, జనరల్ సెక్రటరీ రాజశేఖర్ నాయక్, కో కన్వీనర్ డి. సూర్యరాజ్, జాయింట్ సెక్రటరీ రవి, జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ టి. రామ్‌ప్రసాద్ పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదంలో జొన్న పంట దగ్ధం



అగ్నిప్రమాదంలో దగ్ధమైన జొన్నపంట

సారంగాపూర్, మే 9 (ఆంధ్రజ్యోతి) : మండలంలో గల చర్చి తండాకు చెందిన పారుబాయి అనే రైతు జొన్న పంట శుక్రవారం అగ్ని ప్రమాదంలో దగ్ధమైనట్లు తండా వాసులు తెలిపారు. ఆరుగాలం శ్రమించి పండించిన జొన్న పంట విక్రయించే సమయంలోనే అగ్ని ప్రమాదంలో దగ్ధం కావడంతో రైతు కన్నీరు మున్నీరు అయ్యారు. సుమారు వీటి విలువ రూ. 2లక్షలు ఉంటుందని, బాధిత రైతు తెలిపారు. పాలకులు సంబంధిత అధికారులు బాధిత రైతును ఆదుకోవాలని కోరుతున్నారు.

దేశ సైనికులకు టీజీఈ జేఏసీ సంఘీభావం



సంఘీభావం ప్రకటిస్తున్న జేఏసీ నాయకులు

నిర్మల్ కల్చరల్, మే 9 (ఆంధ్రజ్యోతి) : దేశ రక్షణకు అహర్నిశలు కృషి చేస్తూ పాక్ స్థావరాలను తుదిముట్టిస్తున్నాం. భద్రత సైనిక బలగాలకు శుక్రవారం ఉద్యోగ, పెన్షనర్ల, కార్మిక ఉపాధ్యాయ జేఏసీ సంఘీభావం తెలిపారు. పెన్షనర్ల సంఘ భవనంలో జాతీయ జెండా, పూల బొకేలతో నాయకులు జై భారత్ నినాదాలు చేశారు. దేశ సైనికులకు యావత్ దేశ ప్రజలు అండగా ఉంటుందన్నారు. ఆపరేషన్ సిందూర్ వీరోచితంగా అమలు చేస్తున్నారని హర్షించారు. చైర్మన్ వెల్మల ప్రభాకర్, గౌరవ అధ్యక్షుడు ఎంసీ లింగన్న, నరేంద్రబాబు, తదితరులు పాల్గొన్నారు.

ఫటా.. ఫట్...

లోతు దుక్కులతో రైతులకు ఎంతో ప్రయోజనం

● సారిక, మండల వ్యవసాయాధికారి, కుభీర్



రైతులు భూసారం.. పెంచేందుకు గాను వేసవిలో ముందస్తు చర్యలు తీసుకొని ఖరీఫ్‌లో వేసిన పంటలు అధిక దిగుబడులు సాధించేందుకు మండల ంలోని రైతులకు వ్యవసాయ శాఖ మండల అధికారి సూచనలు సలహాలిలా..

ఆంధ్రజ్యోతి: వేసవిలో లోతు దుక్కులతో రైతులకు కలిగే ప్రయోజనాలేంటి?

ఏవో: వేసవిలో రైతులు లోతు దుక్కులు దున్నిఉంచడం వల్ల వేడెక్కి భూమిలో గల బ్యాక్టీరియాలు, శిలీంద్రాలు తగ్గిపోతాయి. తొలకరి వర్షాలు కురిసిన వెంటనే నీరు భూమిలోకి ఇంకిపోయి భూసారం పెరుగుతుంది. అంతేకాకుండా పంటలేని సమయంలో కలుపు మొక్కలు విపరీతంగా పెరగడం సహజం. ఇవి నేలలోని నీటిని పోషకాలను ప్రత్యక్షంగా గ్రహించి దిగుబడి తగ్గిస్తాయి. దుక్కులతో కలుపు మొక్కలు, వాటిలోని సూక్ష్మజీవులు, లార్వాలు, నేలపైకి వచ్చి ఎండలకు పూర్తిగా నశిస్తాయి.

ఆంధ్రజ్యోతి: రైతులు భూసారాన్ని కాపాడేందుకు ఎలాంటి చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది. అందుకు మీరిచ్చే సలహాలేంటి?

ఏవో: రైతులు భూసారాన్ని కాపాండేందుకు ముఖ్యంగా రసాయన ఎరువులు స్థాయికి మించి వాడకూడదు. వేసవి దుక్కలకు ముందు చేళ్లలో గొర్రెలు, మేకలు, పశువుల మందలను పొలాల్లో తిప్పాలి. అలాగే అవి విసర్జించే మలమూత్రాలు భూమిలోకి చేరి భూసారం పెరుగుతుంది. సూక్ష్మ పోషక లోపాల నివారణ సాధ్య పడుతుంది. ఎకరానికి సగటున ఐదు టన్నుల వరకు పశువుల పేడ వేసుకుంటే భూసారం పెరిగి అధిక దిగుబడులు వస్తాయి. రైతులు ప్రతి మూడేళ్లకు ఒకసారి భూసార పరీక్షలు తప్పనిసరిగా చేయించుకోవాలి.

ఆంధ్రజ్యోతి: ఖరీఫ్ సాగు కోసం రైతులకు మీరిచ్చే సూచనలు, సలహాలేంటి? విత్తన కొనుగోలులో తీసుకోవాల్సిన జాగ్రత్తలేంటి?

ఏవో: రైతులు విత్తనాలు కొనుగోలు గుర్తించి పొందిన డీలర్, దుకాణాల్లో కొనుగోలు చేసి బిల్లులు తీసుకోవాలి. పంట కాలం పూర్తయ్యేంత వరకు బిల్లులు భద్రపరుచుకోవాలి. కొంత మంది దళారులు గ్రామాలకు వచ్చి తక్కువ ధరలకు విత్తనాలు ఇస్తామని చెప్పే మాటలు విని మోసపోవద్దు. గుర్తింపు పొందిన దుకాణాల్లో విత్తనాలను ముందస్తుగా పరిక్షలకు పంపుతున్నందున రైతులు దభయం లేకుండా కొనుగోలు చేయవచ్చు.

- కుభీర్, మే 9(ఆంధ్రజ్యోతి)



మంత్రికి వినతిపత్రం ఇస్తున్న అర్జుమన్ అలీ

మంత్రి జూపల్లిని కలిసిన నిర్మల్ గ్రంథాలయ సంస్థ చైర్మన్

నిర్మల్ కల్చరల్, మే 9(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావును శుక్రవారం సచివాలయంలో నిర్మల్ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సయ్యద్ అర్జుమన్ అలీ మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. నిర్మల్‌లోని బంగల్‌పేట్, వినాయకసాగర్ చెరువు, పాక్‌పట్ల క్రోకడైల్ పార్క్, తదితర వాటిని పర్యాటక ప్రదేశాలుగా అభివృద్ధి చేయాలని కోరారు. మంత్రి సానుకూలంగా స్పందించి జిల్లాలో పర్యటిస్తానని హామీ ఇచ్చినట్టు అర్జుమన్ అలీ తెలిపారు.



మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డిని సన్మానిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

భాగ్యనగర్‌లో లక్ష్మీనరసింహ స్వామి నూతన విగ్రహ ప్రతిష్ఠాపన

నిర్మల్ రూరల్, మే 9(ఆంధ్రజ్యోతి): మండంలోని భాగ్యనగర్ గ్రామంలో శ్రీలక్ష్మీనరసింహ స్వామి దేవాలయంలో శుక్రవారం నూతన విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం ఘనంగా నిర్వహించినట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించామని, భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చారని ఆలయ నిర్వాహకులు ఈ సందర్భంగా పేర్కొన్నారు. అలాగే పూజా కార్యక్రమంలో మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... తాను దేవాదాయ శాఖ మంత్రిగా ఉన్నప్పుడు ఈ ఆలయ నిర్మాణానికి రూ.45 లక్షల నిధులు మంజూరు చేయించినట్లు తెలిపారు. నియోజకవర్గ పరిధిలోని అన్ని ఆలయాలను దేవాదాయ శాఖ మంత్రిగా ఉన్నప్పుడు అభివృద్ధి చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో రామేశ్వర్ రెడ్డి మాజీ ఎంపీపీ, భూమన్న మాజీ సర్పంచ్, డాక్టర్ స్వర్ణ, రాజు మాజీ సర్పంచ్, శ్రీకాంత్ మాజీ కౌన్సిలర్, పాకాల రామచందర్, శ్రీకాంత్ యాదవ్, అనుముల భాస్కర్, నిగులపు సంజీవ్, వినయ్, ఆలయ సభ్యులు, పలువురు నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

ఫొటో న్యూస్



● ప్రైవేట్ వాహనాలు, ట్రావెల్స్ బస్సులను అడ్డదిడ్డంగా పార్కింగ్ చేసిన దృశ్యం

వాహనాలకు అడ్డాగా ఆర్అండ్‌బీ అతిథిగృహం!

● ఆదిలాబాద్‌లో అనుమతి లేకుండా ప్రైవేట్ వాహనాల పార్కింగ్ ● రాత్రి వేళ మందుబాబుల జోరు

ఆదిలాబాద్ పట్టణ నడిబొడ్డున గల.. ఎన్టీఆర్‌చౌక్‌లోని ఆర్అండ్‌బీ అతిథి గృహ ప్రాంగణం అసాంఘీక కార్యకలాపాలకు అడ్డాగా మారింది. ఇక్కడ ఎలాంటి అనుమతి లేకుండా ప్రైవేట్ వాహనాలు, ట్రావెల్స్ బస్సులను అడ్డదిడ్డంగా పార్కింగ్ చేయడంతో వచ్చిపోయే వారికి ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ముఖ్యంగా మహిళలు, యువతులు అటువైపు నుంచి వెళ్లడానికే భయపడుతున్న పరిస్థితులు నెలకొన్నాయి. మరో వైపు మందు బాబులు వాహనాల చాటున సిట్టింగ్‌లు వేసి బహిరంగ మద్యపానం చేస్తున్నారన్న ఆరోపణలున్నాయి. ఇలాంటి వ్యవహారాలతో నడిబొడ్డున గల ఈ ప్రాంతం ఆహ్లాదకర వాతావరణం కోల్పోయి అప్రశాంతతకు నిలయంగా మారుతుందన్న వాదరన వినబడుతుంది. అనేక సందర్భాల్లో ఇదే విషయమై వార్త పత్రికల్లో అనేక కథనాలు ప్రచురితం అయినా.. స్థానికుల నుంచి ఫిర్యాదులు వెల్లువెత్తినా.. సంబంధిత అధికారుల నుంచి స్పందన లేకపోవడం పలు విమర్శలకు తావిస్తోంది. పోలీసు యంత్రాంగమైనా ప్రత్యేక దృష్టి సారించి తగు చర్యలు తీసుకోవాలనే డిమాండ్ వ్యక్తం అవుతోంది.

(- ఆంధ్రజ్యోతి, ఆదిలాబాద్ స్టాఫ్ ఫొటోగ్రాఫర్)



● రాత్రి వేళల్లో మందుబాబులు ఇలా..



కుభీర్‌లో అద్దె భవనంలో కొనసాగుతున్న తపాలా కార్యాలయం



తపాలా భవనం లేక పింఛన్ కోసం ఇబ్బంది పడుతున్న వృద్ధులు

సొంత భవనానికి నోచుకోని తపాలా కార్యాలయం

● పండుటాకులకు తప్పని పింఛన్ కష్టాలు

కుభీర్, మే 9(ఆంధ్రజ్యోతి): కుభీర్ మండల కేంద్రంలో తపాలా కార్యాలయం ఏర్పాటై దాదాపు 50 ఏళ్లకు పైమాటే అంటున్నారు స్థానికులు. కానీ నేటికి సొంత భవనం లేకపోవడం విడ్డూరం. పాలకులు సైతం కార్యాలయానికి సొంత భవనం నిర్మించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఉత్తరాల చేరివేతతో పాటు తపాలా కార్యాలయం ద్వారా పింఛన్లు, బ్యాంకు లావాదేవీలు, వివిధ రకాల పథకాల నిర్వహణ లాంటి ముఖ్యమైన సేవలు నడుస్తున్న విషయం అందరికీ తెలిసిందే. ఈ క్రమంలో కార్యాలయానికి సొంత భవనం లేకపోవడంతో ఇబ్బందులు కలిగిస్తోంది. తపాలా అవసరాలను గుర్తించి నూతన భవన నిర్మాణం చేపట్టాలని మండల వాసులు కోరుతున్నారు.

దీంతో పాటు మండలంలోని చొండి, సొనారి, మాలేగాం, సాంవ్లీ, నిగ్వా, రంజిని, పల్సి, డోడర్న, సిర్పెల్లి, పార్డి(బీ), చాతా గ్రామాల్లోని జీపీలో, అలాగే అద్దె భవనాల్లో తపాలా కార్యాలయాలు కొనసాగుతున్నాయి.



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు



అక్షర శ్రీకార మండపంలో భక్తుల రద్దీ

బాసరలో భక్తుల సందడి

బాసర, మే 9(ఆంధ్రజ్యోతి):చదువుతల్లి బాసర సరస్వతీ దేవి నిలయం శుక్రవారం భక్తుల సందడి నెలకొంది.అక్షర శ్రీకార పూజలకు అనువైన మంచి ముహూర్తం గల శుభదినం కావడంతో భక్తుల తాకిడి పెరిగింది. తెలుగు రాష్ట్రాలతో పొరుగున ఉన్న మహారాష్ట్ర నుండి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. స్థానిక పవిత్ర గోదావరి నదిలో పుణ్య స్నానాలు అచరించి అమ్మవారిని దర్శించుకున్నారు. అంతేకాకుండా రెండు అక్షర శ్రీకార మండపాలు పిల్లలకు పూజలు జరిపించే భక్తులతో దినమంతా కిటకిటలాడాయి. రూ.1000 టికెట్ గల మండపంలో 202 మంది, రూ.150 టికెట్ గల మండపంలో 175 మంది చిన్నారులకు అక్షర శ్రీకార పూజలు జరిగాయి. అమ్మవారి దర్శనం, పూజల కోసం భక్తులు దాదాపు రెండు గంటలు వేచి ఉండాల్సి వచ్చింది.

బీరప్ప ఆలయ నిర్మాణానికి భూమిపూజ

● పాల్గొన్న ముథోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్

లోకేశ్వరం, మే 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని పుష్పూర్ గ్రామంలో శుక్రవారం బీరప్ప ఆలయ నిర్మాణ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ పాల్గొన్నారు. వేద పండితుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి, శంకుస్థాపన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కురుమ సంఘం వారి ఆరాధ్య దైవమైన బీరప్ప స్వామి మందిరము అని అన్నారు. అనంతరం సభ్యులు ఎమ్మెల్యేను శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో భైంసా మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ రాజేష్ బాబు, మండల బీజేపీ అధ్యక్షులు సాయ న్న, మంద భాస్కర్, గన్ను వెంకటరెడ్డి, మండల సీనియర్ నాయకులు, బీజేపీ కార్యకర్తలు, గ్రామస్థులు, తదితరులు పాల్గొన్నారు.

● భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్



వేసవి శిబిరాలతో విద్యార్థుల్లో మరింత ఉత్సాహం

బోథ్, మే 9(ఆంధ్రజ్యోతి): పోలీసుల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వేసవికాలం శిబిరాల వల్ల విద్యార్థులకు ఎంతగానో ఉపకరిస్తాయని, అంతేగాక విద్యార్థుల్లో మరింత చురుకుదనం వస్తుందని డీఎస్పీ జిల్లా ఉపాధ్యక్షుడు వెంకటేష్ పేర్కొన్నారు. శుక్రవారం బోథ్ పోలీస్ స్టేషన్‌లో వేసవి శిబిరంలో కరాటే శిక్షణ పొందుతున్న విద్యార్థులకు పండ్లను పంపిణీ చేశారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదిలాబాద్ జిల్లా ఎస్పీ తీసుకున్న నిర్ణయం ఎంతో మంచిదని, అందుకు బోథ్ పోలీసులు అందిస్తున్న సహకారం వల్ల విద్యార్థులలో మరింత ఉత్సాహం పెరుగుతుందన్నారు. వేసవికాలంలో ఎండల వల్ల విద్యార్థులు అస్వస్థతకు గురికాకుండా శిబిరంలో అవగాహన కలిగించాలని కోరారు. ఈ సందర్భంగా ఎస్ఐ ప్రవీణ్ మాట్లాడుతూ జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న వైఎస్ఆర్ శిబిరానికి విద్యార్థుల్లో నుండే గాక వారి తల్లిదండ్రుల నుండి మద్దతు లభిస్తుందన్నారు. విద్యార్థులు శిబిరాల్లో పాల్గొనేందుకు ఆసక్తి చూపుతున్నారని రోజు రోజుకూ విద్యార్థుల సంఖ్య పెరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కరాటే మాస్టర్ రాజుతో పాటు పలువురు పోలీసులు, తదితరులు పాల్గొన్నారు.



బోథ్ పోలీస్ స్టేషన్లో వేసవికాలం శిబిరంలో పాల్గొన్న విద్యార్థులకు పండ్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

నీళ్లు లేక వెలవెలబోతున్న పశువుల తొట్టీలు

● మండు వేసవిలో మూగ జీవులకు తప్పని నీటి కష్టాలు

తలమడుగు, మే 9 (ఆంధ్రజ్యోతి): వేసవికాలంలో మూగజీవులకు దాహార్తిని తీర్చేందుకు గ్రామాల్లో ఏర్పాటు చేసిన పశువుల తొట్టీలు అధికారుల నిర్లక్ష్యంతో నీళ్ల లేక వెలవేళ బోతున్నాయి. మండలంలోని బరంపూర్ గ్రామపంచాయతీ పరిధిలోని నర్సాపూర్ గిరిజన గ్రామంలో మిషన్ భగీరథ వాటర్ ట్యాంక్ పక్కకు ఉపాధి హామీ పథకం ద్వారా పశువుల తొట్టెను నిర్మించినప్పటికీ పశువుల తొట్టిలో నీళ్ల లేక పశువుల తొట్టి, పగుళ్ల తేలిందని స్థానికులు తెలిపారు. పక్కనే చేతి పంపు మిషన్ భగీరథ వాటర్ ట్యాంకు నుంచి వృథాగా నీరు పోతున్నప్పటికీ.. ఎవరు పట్టించుకోవడం లేదన్నారు. ఇకనైనా సంబంధిత శాఖల అధికారులు స్పందించి మిషన్ భగీరథ నుంచి నర్సాపూర్‌లో నిర్మించిన పశువుల తొట్టెకు నీటిని సరఫరా చేసి వేసవి కాలంలో పశువుల దాహార్తిని తీర్చాలని రైతులు కోరుతున్నారు.



● పక్కనే ఉన్న మిషన్ భగీరథ వాటర్ ట్యాంక్ నుంచి వృథాగా పోతున్న నీరు



● నర్సాపూర్‌లో నిర్మించిన పశువుల తొట్టీలో నీళ్లు లేక వెలవెలబోతున్న దృశ్యం

ఆంధ్రజ్యోతి
andhrajyothy.com శుక్రవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 36.2 । కనిష్ఠం 25.5



నేడు భైంసాలో హనుమాన్ పీఠపూజ

భైంసా, మే 9 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ డివిజన్ కేంద్రమైన భైంసా పట్టణంలోని కిసాన్‌గల్లీలో గల నేతాజీనగర్ శ్రీ రేకేడేశ్వర హనుమాన్ ఆలయంలో హనుమాన్ దీక్షా సేవా సమితి ఆధ్వర్యంలో శనివారం శ్రీ హనుమాన్ పీఠపూజ నిర్వహిస్తున్నట్లు గురుస్వామి కోర్వ చిన్నన్న తెలిపారు. ఉదయం 6 గంటలకు నగర కీర్తన, సాయంత్రం 6గంటలకు పీఠ పూజ ప్రారంభమై 108 సార్లు హనుమాన్ చాలీసా పారాయణం, స్వామి వారికి అభిషేకం, అర్చన, నాగవల్లి దళార్చన, దీక్షా ప్రసాదముతో ముగుస్తుందన్నారు. హనుమాన్ దీక్షాపరులతో పాటు అంజన్న భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. పీఠపూజకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు గురుస్వామి కోర్వ చిన్నన్న తెలిపారు.

జోరందుకున్న ధాన్యం కొనుగోళ్లు



- జిల్లా వ్యాప్తంగా 32 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ
- ఇప్పటి వరకు 5,745 మంది రైతుల నుంచి ధాన్యం కొనుగోళ్లు
- జిల్లాలో కొన్నిచోట్ల తలెత్తుతున్న తరుగు సమస్య
- రైతులకు ఇబ్బంది కలగకుండా నిరంతరం పర్యవేక్షిస్తున్న జిల్లా అదనపు కలెక్టర్
- ధాన్యం విక్రయించిన రైతు ఖాతాలలో త్వరగా డబ్బులు జమయ్యేలా చర్యలు
- రైతుల ఖాతాల్లో రూ. 9.39 కోట్ల ధాన్యం డబ్బుల జమ

అన్నదాత ఆరుగాలం శ్రమించి పండించిన పంట విక్రయించే సమయంలో ఇక్కట్లు తలెత్తకుండా జిల్లాలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కొనుగోళ్ల జోరందుకున్నాయి. ధాన్యం కొనుగోళ్ల ఆరంభదశలో నత్త నడకనసాగడంతో అధికార యంత్రాంగం ధాన్యం కొనుగోళ్లపై పకడ్బందీగా దృష్టి సారించి నిరంతరం పర్యవేక్షించింది. దీంతో తాజాగా కొనుగోలు కేంద్రాల్లో రైతులకు తలెత్తిన ఇబ్బందులు ఒక్కొక్కటిగా తొలగిపోయి ధాన్యం కొనుగోళ్ల ముమ్మరంగా సాగుతున్నాయి. జిల్లాలో 318 కొనుగోలు కేంద్రాలను ప్రారంభించగా ఆయా ప్రాంతాల్లో చేతికి అందిన పంటను ఆధారంగా జిల్లా వ్యాప్తంగా 149 సెంటర్లలో ధాన్యం కొనుగోళ్ల సాగుతున్నాయి.



అకాల వర్షాల భయంతో
ధాన్యం రాశులపై టార్పాలిన్ కవర్లు కప్పి ఉంచిన రైతులు

ఇప్పటి వరకు 32 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ

జిల్లాలో యాసంగిలో 1.60 లక్షల మెట్రిక్ టన్నులకు పైగా ధాన్యం కొనుగోలు చేయడం లక్ష్యంగా జిల్లావ్యాప్తంగా 318 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రభుత్వం ప్రారంభించింది. నిర్మల్, ఖానాపూర్, ముథోల్ 3 నియోజకవర్గాల్లో ఆయా ప్రాంతాల్లో ఉన్న నీటి వసతుల ఆధారంగా వరి పంటను కొన్ని ప్రాంతాల్లో వ్యవసాయ బావులపై ఆధారపడిన రైతులు ముందుగా నాట్లు వేశారు. పంట కాలువలపై ఆధారపడిన రైతాంగం కాస్త ఆలస్యంగా నాట్లు వేశారు. దీంతో ముందస్తుగా నాట్లు వేసిన ప్రాంతాల్లో పంట దిగుబడి ఇదివరకే వచ్చినందున ఆయా ప్రాంతాల్లో ధాన్యం కొనుగోళ్ల ముందస్తుగానే నిర్వహించేలా అధికారులు ఏర్పాటు చేశారు. జిల్లా వ్యాప్తంగా ధాన్యం కొనుగోలు చేసేందుకు 318 కొనుగోలు కేంద్రాలను ప్రారంభించినప్పటికీ జిల్లాలో ప్రస్తుతం 149 కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కొనుగోళ్ల ముమ్మరంగా సాగుతున్నాయి. మిగతా ప్రాంతాల్లో ఆయా ప్రాంతాల్లో పంట చేతికి అందిన సమయానికి అనుకూలంగా కొనుగోళ్లను నిర్వహించేందుకు ముందుస్తుగానే కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి పెట్టారు. జిల్లా వ్యాప్తంగా ఇప్పటి వరకు 32021.84 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసినట్లు అధికారులు లెక్కలు చెబుతున్నారు. ఇందులో 7675.200 మెట్రిక్ టన్నుల సన్నరకం ధాన్యం, 24346.640 మెట్రిక్ టన్నుల దొడ్డు రకం ధాన్యాన్ని కొనుగోలు చేసినట్లు చెబుతున్నారు.

ధాన్యం డబ్బుల జమలో ఇక్కట్లు తలెత్తకుండా చర్యలు

జిల్లావ్యాప్తంగా నిర్వహిస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో సేకరించిన ధాన్యం తాలూకు డబ్బులను ఆయా రైతుల ఖాతాల్లో ఎప్పటికప్పుడు జమయ్యేలా అధికార యంత్రాంగం చర్యలు చేపడుతోంది. కలెక్టర్ అభిలాష అభినవ్, అదనపు కలెక్టర్ కిషోర్‌కుమార్ సహా ఇతర అధికారుల బృందం ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఇక్కట్లు తలెత్తకుండా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటున్నట్లు చెబుతున్నారు. ఇప్పటి వరకు జిల్లాలో 5,745 మంది రైతుల నుంచి 32021.84 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించగా సంబంధిత ధాన్యం విక్రయించిన రైతుల ఖాతాల్లో రూ.9.39 కోట్ల డబ్బులను జమ చేసినట్లు అధికారులు లెక్కలు చెబుతున్నారు. మిగతా రైతుల ఖాతాల్లో ధాన్యం తాలూకు డబ్బులను ఎప్పటికప్పుడు జమ చేసేలా చర్యలు చేపడుతున్నట్లు చెబుతున్నారు.

కొన్నిచోట్ల తలెత్తుతున్న తరుగు సమస్య

ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో కొంత మంది సెంటర్ నిర్వాహకులు మిల్లర్లతో కుమ్మక్కయ్యారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. వీరి అంతర్గత ఒప్పందం నేపథ్యంలో రైతుల నుంచి ధాన్యం సేకరించే సమయంలో తరుగు పేరిట అదనపు ధాన్యాన్ని తూకం వేస్తున్నట్లు చెబుతున్నారు. కొన్ని సెంటర్లలో తప్ప, తాలు ఎక్కువగా ఉందనే సాకుతో రైతులను ఎండలో ఇబ్బంది పెట్టేలా ధాన్యాన్ని జాలి పట్టాల్సిందిగా ఇబ్బందులకు గురి చేస్తున్నారని చెబుతున్నారు. ప్రస్తుతం రైతులు తరుగు పేరిట ఇదివరకే అదనంగా బస్తా వెంబడి కిలోధాన్యాన్ని ఇస్తున్నప్పటికీ.. జిల్లాలోని కొన్ని సెంటర్లలో అదనంగా మరో కిలో నుంచి కిలోన్నర ధాన్యం ఇవ్వాలని నిర్వాహకులు పేచి పెడుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. బస్తా వెంబడి కిలో అదనపు ధాన్యం ఇవ్వడంతో క్వింటాల్‌కు రెండున్నర కిలోల చొప్పున అదనంగా ధాన్యాన్ని ఇస్తున్నప్పటికీ మరో కిలో నుంచి కిలోన్నర ధాన్యం ఇవ్వాలని సెం టర్ నిర్వాహకులు పేచి పెడుతుండడంతో రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గత కొద్ది రోజుల క్రితం ఖానాపూర్‌లో అదనపు ధాన్యం కోసం లారీలను సైతం నిలిపి వేయ డంతో అధికార యంత్రాంగం రంగంలోకి ది గాల్సి వచ్చింది. ఇలా జిల్లాలో పలుచోట్ల తరుగు పేరిట రైతులను ఇబ్బంది పెడుతుం డడంపై జిల్లా అధికార యంత్రాంగం సీరియస్‌గా దృష్టి సారించినట్లు చెబుతున్నారు.

ఎమ్మెల్యే ఏలేటి ఆధ్వర్యంలో టోల్ ఫ్రీ నెంబర్ ఏర్పాటు

రైతులు తాము పండించిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లో విక్రయించే సమయంలో బస్తాకు 41 కిలోల కంటే ఎక్కువగా ధాన్యాన్ని తూకం వేయవద్దని నిర్మల్ ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి రైతులను చైతన్య పరుస్తున్నారు. ధాన్యం తూకం వేసే సమయంలో ఓ బస్తా వెంబడి 41 కిలోల కంటే అదనంగా ధాన్యం తూకం వేస్తే తమకు సమాచారం ఇవ్వాలంటూ ఏకంగా మహేశ్వర్‌రెడ్డి టోల్ ఫ్రీ నెంబర్‌ను ఏర్పాటు చేశారు. ఇందుకుగాను సెల్‌నెంబర్ 9492776975ను ఏర్పాటు చేశారు. సదరు ఫోన్ నెంబర్‌పై ఫిర్యాదు చేస్తే వెంటనే తాము స్పందించి అధికారుల దృష్టికి తీసుకెళ్లి రైతుల సమస్యలను పరిష్కరిస్తామని మహేశ్వర్ రెడ్డి రైతులకు సూచిస్తున్నారు. జిల్లాలో వరి ధాన్యం కొనుగోళ్ల సజావుగా సాగేందుకు ఇటు అధికార యంత్రాంగంతో పాటు నిర్మల్ ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి రైతులకు అండగా నిలవడాన్ని పలువురు స్వాగతిస్తున్నారు.

నిర్మల్, మే 9 (ఆంధ్రజ్యోతి)

జిల్లా పోలీసుల అలర్ట్.. బాసరలో విస్తృత తనిఖీలు



బాసర పోలీసు స్టేషన్‌లో తనిఖీలు నిర్వహిస్తున్న ఎస్పీ జానకీ షర్మిల

బాసర, మే 9 (ఆంధ్రజ్యోతి) : ఇండియా - పాక్ సరిహద్దుల్లో నెలకొన్న యుద్ధ వాతావరణం నేపథ్యంలో జిల్లా పోలీసులు అలర్ట్ అయ్యారు. ఇందులో భాగంగానే శుక్రవారం రాత్రి జిల్లా ఎస్పీ జానకీ షర్మిల బాసర రైల్వే స్టేషన్‌లో డాగ్ స్క్వాడ్‌తో తనిఖీలు చేపట్టారు. అమ్మవారి పుణ్యక్షేత్ర పరిసరాలనూ విస్తృతంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్పీ జానకీ షర్మిల మాట్లాడుతూ.. రైల్వే స్టేషన్‌లో వచ్చి పోయే ప్రయాణికులపై నిరంతర నిఘా ఉంచాలని స్థానిక పోలీసు అధికారులను ఆదేశించారు. ఈ తనిఖీల్లో ఎస్పీతో పాటు భైంసా ఏఎస్పీ అవినాష్ కుమార్, ముథోల్ సీఐ మల్లేష్, బాసర ఎస్సై సంజీవ్ ఇతర పోలీసు సిబ్బంది ఉన్నారు.

పట్టణంలో రాణా ప్రతాప్ సింగ్ జయంతి



నివాళులర్పిస్తున్న మున్సిపల్ మాజీ చైర్మన్ ఈశ్వర్

నిర్మల్ కల్చరల్, మే 9 (ఆంధ్రజ్యోతి) : మహా రాణా ప్రతాప్ సింగ్ 485 జయంతి వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. మాజీ మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్ పాల్గొని ప్రతాప్ సింగ్ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. దేశ రక్షణలో రాణా ప్రతాప్ సింగ్‌ను ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. రాజ్ పుత్ సమాజ్ అధ్యక్షులు లక్ష్మణ్ సింగ్, సభ్యులు విశాల్ సింగ్, నారాయణ్ సింగ్, సాయి సింగ్, తదితరులు పాల్గొన్నారు.

జిల్లా కలెక్టర్‌కు శుభాకాంక్షల వెల్లువ



కలెక్టర్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతున్న వివిధ శాఖల అధికారులు

నిర్మల్ అర్బన్, మే 9 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ జన్మదినం సందర్భంగా శుక్రవారం సాయంత్రం క్యాంపు కార్యాలయంలో శుభాకాంక్షల సందడి నెలకొంది. ఈ సందర్భంగా పలువురు జిల్లా అధికారులు కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చాలు అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. కలెక్టర్‌ను కలిసి శుభాకాంక్షలు తెలిపిన వారిలో వివిధ శాఖల అధికారులు గోవింద్, జీవరత్నం, శ్రీనివాస్, విజయలక్ష్మి, నరసింహారెడ్డి, అశోక్, శంకరయ్య, రామ్‌గోపాల్, విష్ణువర్ధన్, ఖాలిక్ అహ్మద్, రాజేందర్, సుభాష్, తదితరులు ఉన్నారు.

భూ సమస్యలను సత్వరమే పరిష్కరించాలి

● భైంసా ఆర్డీవో కోమల్ రెడ్డి



కుంటాల తహసీల్దార్ కార్యాలయంలో
సిబ్బందితో సమీక్ష నిర్వహిస్తున్న ఆర్డీవో కోమల్‌రెడ్డి

కుంటాల, మే 9 : (ఆంధ్రజ్యోతి) : భూ భారతి పథకంలో రైతుల నుంచి స్వీకరిస్తున్న దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి అందుకు సంబంధించిన సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేయాలని ఆర్డీవో కోమల్‌రెడ్డి అన్నారు. కుంటాల మండలం భూ భారతి పథకానికి పైలట్ ప్రాజెక్టులో ఎంపికైనందున గత ఐదు రోజుల నుంచి గ్రామాల వారీగా రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తూ రైతుల నుంచి పలు రకాల భూ సమస్యలకు సంబంధించి దరఖాస్తులను స్వీకరించిన అధికారులతో శుక్రవారం కుంటాల తహసీల్దార్ కార్యాలయంలో ఆర్డీవో కోమల్‌రెడ్డి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్‌లు కమల్‌సింగ్, ఎజాజ్ అహ్మద్‌ఖాన్, లింగమూర్తి, ప్రవీణ్ కుమార్, శ్రీకాంత్‌లు పాల్గొన్నారు. రైతుల నుండి స్వీకరించిన దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి త్వరలోనే గ్రామాల్లోకి వెళ్లి విచారణ చేపట్టి సమస్యను పరిష్కరించేందుకు కృషి చేయాలన్నారు

సమాచార హక్కు చట్టం ద్వారా కోరిన సమాచారాన్ని ఇవ్వాలి



మున్సిపల్ కమిషనర్‌కు వినతి పత్రం ఇస్తున్న
సమాచార హక్కు చట్ట పరిరక్షణ కమిటీ సభ్యులు

నిర్మల్ రూరల్, మే 9 (ఆంధ్రజ్యోతి) : సమాచార హక్కు చట్టం ద్వారా కోరిన సమాచారాన్ని ఇవ్వకుండా అధికారులు నిర్లక్ష్యం చేయడం సరికాదని సమాచార హక్కు చట్ట పరిరక్షణ కమిటీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ సయ్యద్ హైదర్ అన్నారు. పట్టణంలోని మున్సిపాలిటీకి వస్తున్న సహా దరఖాస్తుల విషయంలో చట్టానికి లోబడి పని చేయాలని కోరుతూ గురువారం మున్సిపల్ కమిషనర్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... సమాచార హక్కు చట్టంపై అధికారులకు, ప్రజలకు అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని కోరారు. సమాచార హక్కు చట్టం 2005లోని సెక్షన్ 6(1) ప్రకారం సంబంధిత అధికారులు దరఖాస్తుదారుడికి సహకరించాల్సి ఉందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు వినోద్, జాతీయ మానవ హక్కుల సహాయ సంఘం జిల్లా చైర్మన్ శ్రీనివాస్, సహా చట్టం పరిరక్షణ కమిటీ వర్కింగ్ ప్రెసిడెంట్ అబ్దుల్ సాదిక్, తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సును అడ్డుకుంటున్నారని మాచాపూర్ గ్రామస్థుల ఆందోళన



ఇరు వర్గాలను సముదాయిస్తున్న పోలీసులు

లక్ష్మణచాంద, మే 9 (ఆంధ్రజ్యోతి) : ఆర్టీసీ బస్సును మల్లాపూర్‌కు చెందిన ఒక కుటుంబం అడ్డుకుంటోందని మాచాపూర్ గ్రామస్థులు శుక్రవారం ఆందోళన చేశారు. బస్సు రాకుండా బండరాళ్లను అడ్డుపెట్టి ఆర్టీసీ సిబ్బందిని ఇబ్బంది పెడుతున్నారని తెలియటంతో మాచాపూర్ గ్రామస్థులంతా మల్లాపూర్‌కు తరలివచ్చారు. పోలీసులకు సమాచారం తెలియడంతో సంఘటన స్థలానికి వచ్చి ఇరుపక్షాలను సముదాయించి ఆర్టీసీ బస్సు రాకపోకలను పునరుద్ధరించారు. ఏదైనా సమస్య ఉంటే పోలీసు స్టేషన్‌కు వచ్చి తేల్చుకోవాలని చెప్పారు. సంఘటన స్థలంలో స్థానిక మాజీ సర్పంచ్ అడిచెర్ల రవికుమార్, కేశం శ్రీనివాస్, కానిస్టేబుళ్లు అశోక్ కుమార్, విజయ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

పీచర, పొట్టపెల్లి(కే) గ్రామాల్లో

వ్యవసాయ పంపుసెట్ల అపహరణ



వ్యవసాయ పంపుసెట్లను
అపహరించిన దృశ్యం

లక్ష్మణచాంద, మే 9 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పొట్టపెల్లి(కే) గ్రామానికి చెందిన ముగ్గురు రైతుల పంపుసెట్లను, కేబుల్ వైర్లను గుర్తు తెలియని వ్యక్తులు గురువారం రాత్రి అపహరించారు. పీచర గ్రామానికి చెందిన నరేష్, పొట్టపెల్లి గ్రామానికి చెందిన శ్రీధర్, భూమేష్‌ల పంపుసెట్లను అపహరించినట్లు శుక్రవారం తెలిసింది. ఇందుకు సంబంధించి శుక్రవారం ఉదయం రైతులు స్థానిక పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేయగా ఎస్సై సుప్రియ సంఘటన స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసి చోరీకి పాల్పడిన వ్యక్తులను త్వరితగతిన పట్టుకుంటామని ఆమె తెలిపారు.

ప్రమాదవశాత్తు చెరువులో పడి రైతు మృతి



గంగారెడ్డి మృతదేహం

నర్సాపూర్(జి), మే 9 (ఆంధ్రజ్యోతి) : ప్రమాదవశాత్తు చెరువులో పడి రైతు మృతి చెందిన ఘటన శుక్రవారం నర్సాపూర్(జి) మండలంలోని తురాటిలో జరిగింది. స్థానికుల వివరాల మేరకు తురాటి గ్రామానికి చెందిన ముక్కెర గంగారెడ్డి (45) తన ఎడ్లను కడగడానికి చెరువుకి తీసుకువెళ్లి కడుగుతుండగా ప్రమాదవశాత్తు కాలుజారి చెరువులో పడి మృతి చెందాడని తెలిపారు. పోలీసులకు సమాచారం అందించామన్నారు. రైతు ముక్కెర గంగారెడ్డి గత రెండు నెలల క్రితం ఎడ్లను కొనుగోలు చేశాడని, 15 రోజులకు ఒకసారి చెరువులో ఎడ్లను శుభ్రంగా కడిగేవాడని, గంగారెడ్డి మృతి చెందడంతో అతని భార్య సుమలత రోదనలు మిన్నంటాయి. భార్య సుమలత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సాయికిరణ్ తెలిపారు. గంగారెడ్డికి మృతికి కారణంగా చెరువులో జేసీబీలతో గుంతలు తీయడంతోనేనని, చెరువులో గుంతలు తీయకుండా చూడాలన్నారు.

మరమ్మతుల కోసం

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

నిర్మల్ రూరల్, మే 9 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ సరఫరాను శనివారం నిలిపివేస్తున్నామని డివిజనల్ విద్యుత్ అధికారి నాగరాజు తెలిపారు. మండలంలోని ఎల్లపెల్లి, అక్కాపూర్ సబ్‌స్టేషన్‌ల లైన్‌ల మరమ్మతుల కొరకు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 11 గంటల వరకు ఎల్లపెల్లి, మహాలక్ష్మి వాడ, అక్కాపూర్, అనంతపేట్, నీలాయిపేట్, కొండాపూర్, పోచంపాడ్, మేడిపల్లి, రత్నాపూర్ కాండ్లి గ్రామాల్లో అంతరాయం ఉంటుందని తెలిపారు. పట్టణంలోని ఆదర్శనగర్ సబ్‌స్టేషన్ మరమ్మతుల దృష్ట్యా సబ్‌స్టేషన్ పరిధిలో ఉదయం 8:30 నుంచి 9:30 వరకు విద్యుత్ సరఫరా ఉండందని విద్యుత్ అధికారులు తెలిపారు. 11 కేవీ ఆదర్శనగర్ మరమ్మతుల దృష్ట్యా ఆదర్శనగర్, రాంనగర్, గాయత్రిపురం, ఆస్రా కాలనీ, ఈద్గాం, భాగ్యనగర్, ఫిష్ మార్కెట్, సిద్దాపూర్ ఏరియాల్లో ఉదయం 8:30 నుండి 12:30 వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ అధికారులు తెలిపారు.

నేడు ఖానాపూర్, కడెం మండలాల్లో..

ఖానాపూర్, మే 9 (ఆంధ్రజ్యోతి) : 33/11 కేవీ సబ్‌స్టేషన్ల మరమ్మతుల నేపథ్యంలో శనివారం ఖానాపూర్, కడెం మండలాల్లోని పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు ఖానాపూర్ విద్యుత్ శాఖ ఏఈ రాంసింగ్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం సాయంత్రం ఆయన ఒక ప్రటకన విడుదల చేశారు. ఈ సందర్భంగా ఖానాపూర్, సుర్జాపూర్, సత్తెనపల్లి, బీర్నంది, పాత ఎల్లాపూర్, కడెం మండంలోని లింగాపూర్ సబ్‌స్టేషన్‌లో, విద్యుత్ లైన్లలో మరమ్మతులు నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. విద్యుత్ తీగలపై ఫీడర్లపై ఉన్నచెట్ల కొమ్మలను సైతం తొలగించనున్నట్లు తెలిపారు. విద్యుత్ మరమ్మతుల కారణంగా పై సబ్‌స్టేషన్ల పరిధిలో వచ్చే గ్రామాలన్నింటిలో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపి వేస్తామని ఆయన పేర్కొన్నారు. విద్యుత్ మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరాలో జరుగుతున్న అంతరాయాన్ని గమనించి ప్రజలు విద్యుత్ శాఖ అధికారులకు, సిబ్బందికి సహకరించాలని కోరారు.

పోక్సో కేసులో నిందితుడికి జైలు

నిర్మల్ రూరల్, మే 9 (ఆంధ్రజ్యోతి) : పోక్సో చట్టం పరిధిలోని ఒక కేసులో భైంసా రూరల్ మండల పరిధిలోని ఓ గ్రామానికి చెందిన అజయ్(29) అనే యువకుడికి కోర్టు పదేళ్ల జైలుశిక్ష విధించింది. అదే గ్రామానికి చెందిన బాలిక(12)తో అసభ్యంగా ప్రవర్తించాడని భైంసా రూరల్ పోలీసుస్టేషన్‌లో 2021 సంవత్సరంలో కేసు నమోదైంది. పోలీసులు దర్యాప్తు చేపట్టి విచారించారు. నేరం రుజువు కాడంతో ఫాస్ట్ ట్రాక్ కోర్ట్ పోక్సోచట్టం కింద నిందితుడికి 10 సంవత్సరాల జైలు రూ. 3 వేల జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించింది.

మద్యానికి బానిసై ఒకరి ఆత్మహత్య



గులాబ్‌రావు
(ఫైల్)

తానూర్, మే 9 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని దాగం గ్రామానికి చెందిన గాడేకర్ గులాబ్‌రావు(40) అనే వ్యక్తి ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు. వివరాల ప్రకారం... గులాబ్‌రావు గత కొన్ని రోజులుగా తాగుడికి బానిసై, జీవితంపై విరక్తి చెందాడు. ఈ క్రమంలో గురువారం రాత్రి ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడికి ఒక కొడుకు, భార్య శాంతాబాయి ఉన్నారు. భార్య ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ట్రైని ఎస్సై నవనీత్ రెడ్డి తెలిపారు.